ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 20.0
ANDHRAJYOTHY
5

నారాయణపేట
జిల్లా వార్తలు
బుధవారం 3 డిసెంబరు 2025


మానసిక దివ్యాంగుడు సాయిచరణ్‌తో తల్లి

వైకల్యాన్ని జయించి.. ముందడుగు వేసి

- వివిధ రంగాల్లో దివ్యాంగుల ప్రతిభ
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

6


చిన్నచింతకుంట మండలం వడ్డెమాన్ గ్రామంలో నామినేషన్ వేసేందుకు వరుసలో నిల్చున్న అభ్యర్థులు

చివరి రోజు అదే జోరు

- అర్ధరాత్రి వరకు కొనసాగిన నామినేషన్లు
- ముగిసిన రెండో విడత.. నేటి నుంచి మూడో విడత
- నేడు మొదటి విడతకు ఉపసంహరణ
- పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన

మహబూబ్‌నగర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల రెండోవిడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. రెండో విడతలోనూ చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. రెండో రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు రాగా, మంగళవారం తక్కువగానే ఉంటాయని భావించారు. కానీ రెండో రోజుకన్నా చివరి రోజే ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. రాత్రి క్యూలో ఉన్న వాళ్లకు టోకెన్లు ఇచ్చి, బయటకు పంపించారు. టోకెన్ల ప్రకారం పది మంది చొప్పున లోపలికి అనుమతించారు. కొందరు బయటకు వచ్చి టీ, స్నాక్స్ తిని మళ్లీ నామినేషన్ వేసేందుకు వెళ్లారు. నేడు నామినేషన్లను పరిశీలించనున్నారు.

నేటి నుంచి మూడో విడత

ఎన్నికల రెండు విడుతల నామినేషన్ల స్వీకరణ ముగిసింది. బుధవారం నుంచి ఈ నెల 5 వరకు మూడో విడత మండలాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. జిల్లాలోని జ డ్చర్ల, మూసాపేట, అడ్డాకుల, భూత్పూరు, బాలానగర్ మండలాలకు సంబంధించి 133 గ్రామ పంచాయతీలు, 1,152 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

మండలాల వారీగా రెండో విడత చివరి రోజు వచ్చిన నామినేషన్ల వివరాలు

మండలం	గ్రా.పం	సర్పంచ్	వార్డు
1. దేవరకద్ర	18	124	380
2. చిన్నచింతకుంట	18	-	-
3. కౌకుంట్ల	12	80	240
4. హన్వాడ	35	233	747
5. కోయిలకొండ	44	258	-
6. మిడ్జిల్	24	149	463

నేడు ఉపసంహరణ

మొదటి విడత ఎన్నికల నామినేషన్ల నేడు ఉపసంహరణ జరుగనుంది. 5 గంటల తరువాత పోటీలో ఉన్న అభ్యర్థులకు అక్షరమాల ప్రకారం బ్యాలెట్‌లో గుర్తులను కేటాయిస్తారు. ఈనెల 11న మొదటి విడత గ్రామాలలో ఓటింగ్ జరుగనుంది. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులను తప్పించేందుకు నాయకులు ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టారు. బుజ్జగింపులు, బేరసారాలు, బెదిరింపులు కొనసాగుతున్నాయి. కొందరు అభ్యర్థులు మాత్రం ఉపసంహరణ చేయిస్తారన్న భయంతో ఇప్పటికే తమ ఫోన్‌లు స్విచ్ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

తగ్గుతున్న.. కూరగాయాలు

సామాన్యులకు ఊరట

- టమాట కిలో రూ.60 నుంచి రూ.30కి..
- పచ్చిమిర్చి రూ.60 నుంచి రూ.50కి..
- స్థానిక రైతుల నుంచి దిగుబడి వస్తుండటంతో తగ్గుదల


మహబూబ్‌నగర్ రైతు బజార్‌లో కూరగాయలు కొంటున్న మహిళలు




పాలమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నెలలో సెంచరీకి చేరువలో ఉన్న కూరగాయల ధరలు తగ్గుతున్నాయి. వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బతినడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల గత నెలలో ధరలు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం స్థానికంగా పండించిన రైతులు రైతుబజార్‌కు కూరగాయలు తెస్తుండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. గత నవంబరు 22న టమాట కిలో ధర రూ.60 ఉండగా నేడు రూ.30 పలుకుతోంది.

ఏటా తగ్గుతున్న కూరగాయల సాగు

మహబూబ్‌నగర్ జిల్లాలో కూరగాయల సాగు ఏటా తగ్గుతోంది. జిల్లాలో 5 వేల ఎకరాల్లోనే కూరగాయలు సాగు చేస్తున్నారు. అవి జిల్లా ప్రజలకు చాలడం లేదు. పైగా గత నెలలో వర్షాలు కురవడం వల్ల తోటలు దెబ్బతిని, దిగుబడి పడిపోయింది. దాంతో వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం, కర్ణాటక, బెంగళూరు, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఇదే అదునుగా దళారులు, వ్యాపారులు ధరలను పెంచి, సొమ్ము చేసుకుంటున్నారు.

ధరలు కిలోకు రూ.ల్లో..

కూరగాయలు	నవంబరు 22న	ఈ నెల 2న
టమాట	60	30
వంకాయ	80	55
పచ్చిమిర్చి	60	50
బీరకాయ	60	50
దొండకాయ	70	50
బెండకాయ	60	50
కాకరకాయ	60	50
గోరు చిక్కుడు	70	60
క్యారెట్	80	70

50 శాతం పెంపు

దిగుబడి తగ్గడంతో వ్యాపారులు కూరగాయల ధరలు 20 నుంచి 50 శాతం వరకు పెంచారు. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు టమాట కిలో రూ.60కి, వంకాయ రూ.80కి అమ్మారు. ఆకు కూరలదీ అదే పరిస్థితి. నూనెలు, బియ్యం, పప్పుధాన్యాలు, చింతపండు ధరలు కూడా పెరిగాయి. ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు తగ్గడం సంతోషకరం


టమాట, బీరకాయ, ఉల్లిగడ్డ, అల్లం ధరలు ఎక్కువ పెరిగాయి. ఈ మధ్య కిలో టమాట కేజీ ధర రూ.60 నుంచి రూ.30కి తగ్గటం సంతోషం. కూరగాయలు దొరకటం లేదని వ్యాపారులు ధర పెంచి అమ్ముతున్నారు. అధికారులు ధరలు పెరుగకుండా చూడాలి.

\- అనిత, గృహిణి, మహబూబ్‌నగర్

20 రోజులకే ధరల్లో తేడా


20 రోజుల కిందట ఉన్న ధరలు ఈ రోజు లేవు. వర్షాలకు తోటలకు నష్టం వాటిల్లిందని వ్యాపారులు కూరగాయలను ఎక్కువ ధరకు అమ్మారు. అధికారులు ప్రజలందరికీ సరిపోయేలా కూరగాయలను నిల్వ ఉంచి, ధరలను అందుబాటులో ఉంచాలి.

\- నర్సింగమ్మ, రిటైర్డ్ టీచర్, మహబూబ్‌నగర్


పోటీల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కంచన్‌పల్లి పాఠశాల ఉపాధ్యాయినులు(ఫైల్)

రాష్ట్ర స్థాయికి 8 స్కూల్స్

- స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ పోటీల్లో ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్వచ్ఛత, పచ్చదనమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ పోటీల్లో జిల్లాలోని ఎనిమిది పాఠశాలలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. మొత్తం 1,136 పాఠశాలలు, విద్యా సంస్థలు ఇందులో పాల్గొనగా, 343 పాఠశాలలు నాలుగు, ఐదు స్టార్ రేటింగ్‌లు సాధించాయి. అందులో 8 పాఠశాలలు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాయి. వివిధ విభాగల్లో మొదటి, రెండవ స్థానంలో నిలిచాయి. ఈ మేరకు వాటిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సీఎంఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

- రూరల్-1లో గండీడ్ మండలం కొంరెడ్డిపల్లి మహమ్మదాబాద్ మండలం కంచన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, రాజాపూర్ మండలం కల్లెపల్లి మండల పరిషత్ పాఠశాలలు ఎంపికయ్యాయి.
- రూరల్ -2లో జడ్చర్ల మండలం పోలెపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాల, గండీడ్ మండలం వెన్నచేడ్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, భూత్పూర్ మండలం తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికయ్యాయి.
- అర్బన్-1లో బాదేపల్లి తెలుగువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది.
- అర్బన్-2లో మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఎదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన పాఠశాలలను జాతీయ స్థాయి ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైతే రూ.లక్ష నగదును అందిస్తారు. ప్రధాని మోదీ నుంచి పురస్కారాలు అందుకుంటారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- ఎన్నికల పరిశీలకురాలు


మరికల్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి

దామరగిద్ద, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, పొరపాట్లకు తావివ్వొద్దని సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి సూచించారు. గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మంగళవారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం విఠలాపూర్ పంచాయతీలో పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. కేంద్రంలో సదుపాయాలను పరిశీలించారు. పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందన్నారు. ప్రతీ సెంటర్ వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, సందేహాలు ఉంటే సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు వెంకటేష్, డిప్యూటీ ఎస్‌ఓ నటరాజ్ పాల్గొన్నారు.


వంట ఏజెన్సీ వారితో మాట్లాడుతున్న విద్యార్థులు

పురుగుల అన్నం.. నీళ్ల చారు మాకొద్దు

- మహమ్మదాబాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఆందోళన

మహమ్మదాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురుగుల అన్నం, నీళ్ల చారు మాకొద్దంటూ మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. కొన్ని రోజులుగా మధ్యాహ్న భోజనం అధ్వాన్నంగా ఉంటోందని, ఉపాధ్యాయులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో నెల కిందట అధ్వాన్నంగా మధ్యాహ్న భోజనం అన్న శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. కథనం వచ్చిన వారం పాటు నాణ్యమైన భోజనం అందించారని, ఆ తర్వాత మళ్లీ మొదటికొచ్చారని విద్యార్థులు తెలిపారు. భోజనం బాగోలేక ఇళ్లకు వెళ్లి తింటున్నామని చెప్పారు. బుధవారం భోజనంలో పురుగులు, మట్టిపెడ్డలు రావడంతో వంట ఏజెన్సీ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో ర్యాలీగా వెళ్లి, మహబూబ్‌నగర్-చించోలి 167 జాతీయ రహదారిపై బైఠాయించారు. డీఈవో, కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. పోలీసులు, ఎంఈవో రాజు నాయక్ విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయమై డీఈఓ ప్రవీణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో మాట్లాడగా, విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరతామని చెప్పారు.

గుడ్డు గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి


పాండు(ఫైల్)

జడ్చర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉడకబెట్టిన గుడ్డును మింగే ప్రయత్నం చేయగా గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని చైతన్యనగర్‌కాలనీలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన జంగం పాండు(40) అనే వ్యక్తి కిరాయికి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి కిరాయికి తీసుకున్న ఆటోను యజమానికి ఇచ్చిన అనంతరం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. పాండు భోజనం చేస్తూ ఉడకబెట్టిన గుడ్డును నమలకుండా మింగే ప్రయత్నం చేశాడు. దీంతో గొంతులో గుడ్డు ఇరుక్కుపోయి ఊపిరాడక తీవ్ర ఇబ్బందిపడ్డాడు. వెంటనే చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 135.00
హోల్ సేల్	: 144.00
డ్రెస్డ్	: 228.00
స్కిన్ లెస్	: 259.00

స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
- పార్టీల నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల నియమావళి)ను పాటించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. జిల్లాలో 3,674 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మూడు విడతల్లో 999 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటినీ, అభ్యర్థుల వ్యయ పరిమితులపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు వారి తుది జాబితాలోని పేర్ల అక్షర క్రమం ఆధారంగా కేటాయిస్తామని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో వివాదాలు లేకుండా ఉండేందుకు మంచి ప్రవర్తన కలిగిన ఏజెంట్లను నియమించాలని నాయకులకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఎన్నికల వ్యయ ఖాతాలు అందించాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

మరికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల వ్యయ ఖాతాల నిర్వహణ పత్రాలను అందించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. మంగళవారం ఆమె మరికల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం నామినేషన్లు స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. అభ్యర్థుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను తీసుకొని, దరఖాస్తులకు జతపర్చాలని, డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. నిర్దేశిత డిపాజిట్ తీసుకొని, రశీదు ఇవ్వాలన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో ఏరోజుకు ఆరోజు అతికించాలన్నారు. హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల వివరాలను టీపోల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పృథ్వీరాజ్, పంచాయితీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చివరి రోజు నామినేషన్ల సందడి

- రెండో విడత ఎన్నికకు ముగిసిన నామినేషన్ల పర్వం


సింగారం పంచాయతీ దగ్గర నామినేషన్ల సందడి

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత జరిగే పంచాయతీ ఎన్నికల సర్పంచ్, వార్డు స్థానాల నామినేషన్ల పర్వం మంగళవారం ముగిసింది. నాలుగు మండలాల్లోని 35 క్లస్టర్ల నామినేషన్ల కేంద్రాల దగ్గర చివరి రోజు కావడంతో పంచాయతీల దగ్గర నామినేషన్లు వేసే వారి సందడి చేశారు. నారాయణపేట నియోజకవర్గంలో దామరగిద్ద, ధన్వాడ, నారాయణపేట, మరికల్ మండలాల్లో 95 సర్పంచ్ స్థానాలకు మూడో రోజు మంగళవారం రాత్రి 10 గంటల వరకు 207 నామినేషన్లు, 900 వార్డు స్థానాలకు 811 నామినేషన్లు వచ్చాయి. మూడు రోజుల్లో మొత్తం రాత్రి 10 గంటల వరకు సర్పంచ్ స్థానానికి 468, వార్డుల స్థానాలకు 1,324 నామినేషన్లు వచ్చాయి.

పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- నేడు నెమలివాహన సేవ, ప్రభోత్సవం

7


జమిస్తాపూర్‌లో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు, గ్రామస్థులు

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్

- రూరల్ మండలంలో నిర్వహణ..

6

వాలీబాల్ చాంపియన్‌గా ఉమ్మడి పాలమూరు బాలికల జట్టు

- మూడో స్థానంలో బాలుర జట్టు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీ

6

వాలీబాల్ చాంపియన్‌గా ఉమ్మడి పాలమూరు బాలికల జట్టు

» మూడో స్థానంలో బాలుర జట్టు



రాష్ట్రవాలీబాల్ విజేత బాలికల జట్టు, మూడో స్థానంలో బాలుర జట్టుతో జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత నెల 29 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలుర జట్టు మూడవ స్థానంతో సరిపెట్టుకున్నది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులను, కోచ్, మేనేజర్లు పర్వేజ్‌పాష, ఖదీర్, గీతలను మంగళవారం వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, మహ్మద్‌హనీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, దస్తగిర్‌లు అభినందించారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జి వేణుగోపాల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-19 హ్యాండ్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు రజినీకాంత్‌రెడ్డి, జియావుద్దీన్, శంకర్, ఆసీఫ్, ప్రదీప్, బాలు, అర్చన పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతగా నిలవాలి

» కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

» పోటీలకు తరలిన జిల్లా కబడ్డీ బాలికల జట్టు



జిల్లా కబడ్డీ బాలికల జట్టుతో జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ ఆకాంక్షించారు. నల్గొండ జిల్లాలో బుధవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనేందుకు జిల్లా బాలికల జట్టు మంగళవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ఎంతో మంది జాతీయస్థాయి టోర్నీల్లో రాణించారని గుర్తుచేశారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు బాలరాజు, గణేష్, సంగీత, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆంజనేయస్వామి ఉత్సవాలు



ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

దేవరకద్ర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న రాజమూర్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, అలంకరణ, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, పంచా మృతాభిషేకం అనంతరం రాత్రికి ఆలయ ఆవరణంలో శ్రీనివాస కల్యాణం, హంస వాహనం వంటి కార్యక్ర మాలు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ ఈవో శ్యాంసుందర్‌చారి తెలిపారు. ఆలయ చైర్మన్ గోపాలచారి, భక్తులు పాల్గొన్నారు.



రాగి పైరులో ఆటో సాయంతో ఎట్టం కొడుతున్న రైతు రఘు

ఆటోతో రాగి పంటకు ఎట్టెం

రాగి పైరు ఏపుగా పెరిగేందుకు, కొత్త పిలకలు వచ్చేందుకు రైతులు ఎట్టెం కొడతారు. అందుకోసం సాధారణంగా ఎద్దులను వినియోగిస్తారు. కానీ ఓ రైతు ఎద్దులు అందుబాటులో లేకపోడంతో ఆటోకు ఎట్టం కట్టి పొలంలో తిప్పాడు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ గ్రామానికి చెందిన రఘు ఈ పద్ధతిని ఎంచుకున్నాడు.

- హన్వాడ (ఆంధ్రజ్యోతి)

వైకల్యాన్ని జయించి.. ధైర్యంగా ముందడుగు వేసి..

» వివిధ రంగాల్లో దివ్యాంగుల ప్రతిభ

» తమ పిల్లల కోసం టీచర్లుగా మారిన తల్లులు

» నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వారు వైకల్యాన్ని జయించారు. అందరితో సమానంగా నిలవాలన్న లక్ష్యంతో ధైర్యంగా ముందడుగులు వేస్తున్నారు. వికలత్వం శరీరానికే కానీ మనసుకు కాదని నిరూపిస్తున్నారు. తమకు ఇష్టమైన రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ అందరినీ అబ్బుర పరుస్తున్నారు. పట్టుదలతో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ తాము ఎందులోనూ తక్కువ కాదని సమాజానికి చాటి చెప్తున్నారు. తల్లిదండ్రులు సైతం వారి వెన్నంటి ఉంటూ ప్రోత్సహిస్తుండటంతో అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. దీంతో పాటు వారికి ప్రభుత్వం కూడా తోడ్పాటును అందిస్తోంది. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కొందరు దివ్యాంగులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలు మీ కోసం...



కన్నవారి భవిష్యత్తు కోసం..



మానసిక దివ్యాంగురాలైన కుమార్తెతో తల్లి సుజాత

సాధారణంగా తమ పిల్లలు పుట్టుకతో దివ్యాంగులైతే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఆ బాధను దిగమింగుకొని తమ పిల్లలకు ఉత్తమ భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా భావించారు. అందుకోసమే వారు బీఈడీ చదువుకున్నారు. అందులోనే స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యను అభ్యసించి తమ పిల్లలు చదివే పాఠశాలలోనే టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాలలో ఎంఏ బీఈడీ చదువుకొని స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన అంజనేశ్వరి తన 11 ఏళ్ల కొడుకు(మానసిక దివ్యాంగుడు)ను చూసుకునేందుకు అదే పాఠశాలలో టీచర్‌గా చేరారు. తన కొడుకుతో పాటు మరికొంత మంది దివ్యాంగులకు కూడా చదువు చెప్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. అదేవిధంగా ఎంఏ బీఈడీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుకున్న సుజాత కూడా అదే పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. తన 20 ఏళ్ల కుమార్తె (మానసిక దివ్యాంగురాలు)ను దగ్గరుండి చూసుకుంటూ మిగతా పిల్లలకు కూడా పాఠాలు బోధిస్తోంది. మానసిక దివ్యాంగులు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు వీరద్దరూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కంప్యూటర్‌లో రాణిస్తూ..



కంప్యూటర్ పనులు చేస్తున్న మానసిక దివ్యాంగుడు ప్రణీత్

జిల్లాకేంద్రానికి చెందిన ప్రణీత్ బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాలలో ఒకేషనల్ శిక్షణ పొందుతున్నాడు. పుట్టుకతో దివ్యాంగుడైన అతడికి, అన్ని విధాలా తల్లే అండగా నిలిచింది. కుమారుడిని కంప్యూటర్ శిక్షణలో చేర్పించింది. ఆ బాలుడు ప్రస్తుతం కంప్యూటర్‌లో రాణిస్తున్నాడు. వర్డ్, ఎక్సెల్ తదితర విభాగాల్లో ఆరితేరాడు. పాఠశాలకు సంబంధించిన ఏ ప్రోగ్రామింగ్ అయినా కంప్యూటర్లో తానే సమాచారాన్ని నమోదు చేస్తుంటాడు. కంప్యూటర్ రంగంలో తన కొడుకును పరిజ్ఞానవంతుడిగా తయారు చేయాలన్నదే లక్ష్యమని అతడి తల్లి అరుణ చెప్తున్నారు.

ఇంతయినా అంతవాడు



డ్యాన్స్ చేస్తున్న మానసిక దివ్యాంగుడు గౌతమ్

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ధనలక్ష్మీ కాలనీకి చెందిన గౌతమ్ పుట్టుకతో మానసిక దివ్యాంగుడు (మరుగుజ్జు). అతడు జిల్లాకేంద్రంలోని బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాలలో ప్రి- ఒకేషనల్-1 చదువుతున్నాడు. బుద్ధిమాంద్యం ఉన్నప్పటికీ డ్యాన్స్‌లో మాత్రం దిట్ట. ఇటీవల హైదరాబాద్‌లోని జాతీయ మానసిక దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, నవరాత్రి ఉత్సవాలు, వివిధ దినోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లోనూ నృత్యం ప్రదర్శనలు ఇస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. అందరిని ఆకట్టుకుంటాడు. నవరాత్రి ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలలో కూడా డాన్సులు చేస్తుంటాడు.

రూ. 26 వేల వేతనం ఇవ్వాలి

» కాంట్రాక్టు కార్మికుల డిమాండ్

» గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా



ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న సిబ్బంది

గద్వాల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి. అంజనేయులు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు తక్కువ సంఖ్యలో ఉండటంతో పనిభారంతో అవస్థలు పడుతున్నారన్నారు. దీనికి తోడు సరైన వేతనాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగుతున్నా కార్మికుల స్థితిగతులు మారలేదన్నారు. కాంట్రాక్టర్ అందుబాటులో లేక సూపర్‌వైజర్ల వేధింపులతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

హాస్పటల్‌లో 320 బెడ్లు ఉండగా, 60 మంది లోపే శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు ఉండటం దారణమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కార్మికుల సంఖ్యను పెంచాల'ని, మూడేళ్ల కాల పరిమితి దాటినందున పాత కాంట్రాక్ట్‌ను రద్దుచేసి కొత్తగా టెండర్లు పిలవాలని డిమాండ్ చేసారు. ధర్నాలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పరశు, సిబ్బంది మతిన్, లక్ష్మణ్, అంజి, కన్నా, వెంకటేశ్వరి, చిట్టెమ్మ, జయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



జమిస్తాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలు గాజులపేట, జమిస్తాపూర్, ధర్మాపూర్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ ప్రజలకు భద్రత, నమ్మకం కలిగించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ ఒక్కరూ చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పర్యవేక్షణ, రాత్రివేళ బీట్ పెట్రోలింగ్ ఉంటుందని చెప్పారు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నారాయణపేటలో ముగిసిన అనంతోత్సవాలు

» విశ్వవల్లభ తీర్థ స్వామీజీకి పుష్పాభిషేకం

» వైభవంగా మహా రథోత్సవం

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని అనంతసేన ఆలయంలో కొనసాగుతున్న అనంతోత్సవం, ధార్మిక కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కర్ణాటక సోదెవాదిరాజ మఠం పీఠాధిపతి విశ్వవల్లభ తీర్థ స్వామిజీ నేతృత్వంలో అనంతసేన స్వామి మూలవిరాట్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూలరాముల సంస్థాన పూజ, మహారథోత్సవాలను వైభవంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీపాద్ ఆధ్వర్యంలో స్వామిజీకి పుష్పభిషేకం చేశారు. కార్యక్రమంలో జ్యోషి రఘుప్రేమాచార్య, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, స్వాములు

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు

అయిజ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని పులికల్, నాగల్‌దిన్నె ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ప్రారంభించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దళారులు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, ఇక్కడికి తీసుకొచ్చి విక్రయించే అవకాశం ఉంది. దీన్ని అడ్డుకునేందుకు అలంపూర్ మండలంలోని రాయల్‌పాడు, రాజోళిలో సుంకేసుల, ఉండవల్లిలో పుల్లూరు, బైరాంపుర్, గట్టులోని బల్గేర ప్రాంతాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటిని వ్యవసాయం, పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు గద్వాల ఉపాధ్యాయుడు



టి రవిశంకర్

గద్వాల సర్కిల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చండీగఢ్ రాష్ట్రంలోని పంజాబ్ యూనివర్సిటీలో ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్)గద్వాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు టి.రవిశంకర్ ఎంపికయ్యారు. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్ జరుగనున్నది. రవిశంకర్ పుల్లూరు జడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుంచి ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, విషయ నిపుణులు హాజరుకానున్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి

» పీజీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం



కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు , విద్యార్థులు

కొల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలని కొల్లాపూర్‌లోని పీజీ కళాశాల (పీయూ అనుబంధం) ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంలో భాగంగా కొల్లాపూర్ పట్టణంలోని పీజీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ దాని సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రకృతి పర్యావరణంతో జరిగే లాభనష్టాలను క్లుప్తంగా వివరించారు. సమాజంలో ప్రతీ ఒక్క విద్యార్థి బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు యువత ముందుకు రావాలని విద్యార్థులను కోరారు. అడవులను రక్షించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంతోష్ కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

» ప్రయాణికులు సురక్షితం



రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ డీలక్స్ బస్సు

మూసాపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ డీలక్స్ బస్సు అదుపుతప్పింది. సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న సూపర్ డీలక్స్ బస్సు జానంపేట పాత పెట్రోల్ బంకు వద్దకు రాగానే, ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సెడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుకనే ఉన్న బస్సు అదుపుతప్పి, రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్లకు తగిలి ఆగింది. దీంతో ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వారందరినీ మరో బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. సంఘటనపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

పట్టపగలే ద్విచక్ర వాహనం చోరీ

మద్దూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచ క్రవాహనం చోరీకి గురయ్యింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, మద్దూరులో జరిగింది. పట్టణంలోని బుక్కగేరిలో నివసిస్తున్న ఎండీ ఇలియాస్ మంగళవారం ఉదయం తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉంచి, నారాయణపేటకు వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. దీంతో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

మానవపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆరుగురిని బైండవర్ చేయించినట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. అనంతరం వారిని లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను వెల్దండ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని కొట్ర చౌరస్తా సమీపంలో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కల్వకుర్తి నుంచి వెల్దండ వైపు ఇసుకలోడుతో వస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో జాజాల గ్రామానికి చెందిన టిప్పర్ యజమాని రాజిరెడ్డి, డ్రైవర్ కుర్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బాలానగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఎఫ్ఎస్‌టి బృందం బాలానగర్ మండల కేంద్రం సమీపంలో తనిఖీలు చేస్తుండగా దేవుని గుట్టతండా వైపు వెళ్తున్న మారుతి డిజైర్‌ను ఆపారు. కారులో పరిశీలించగా దాదాపు రూ. 10 వేల విలువైన వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లు లభించాయి. దీంతో డ్రైవర్ లావుడియా నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫోన్ చోరీ చేసి.. ఫోన్‌పేతో రూ. 1.92 లక్షల కాజేత

» ఖాతాను ఫ్రీజ్ చేయించిన పోలీసులు

సంతోష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ చోరీ చేసి అందులోని ఫోన్ పే యాప్‌ను ఉపయోగించి ఓ దొంగ నగదు కొట్టేశాడు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలెపల్లికి చెందిన రాధాకృష్ణారావు(74)మాజీ సర్పంచ్. గత నెల 13న నాగోల్‌లో ఉంటున్న కుమారుడి ఇంటికొచ్చాడు. తిరిగి సాయంత్రం తన స్వస్థలమైన పోలెపల్లికి వెళ్లేందుకు నాగోల్‌లో బస్సు ఎక్కి మిధాని బస్టాండ్ వద్ద దిగాడు. ఆరాంఘర్‌కు వెళ్లే బస్సులో ఎక్కి కొద్ది దూరం ప్రయాణించాక తన సెల్‌ఫోన్ పోయిందని గుర్తించాడు. పోలెపల్లికి వెళ్లి కొత్త సెల్, సిమ్ వేసి పరిశీలించారు. అప్పుడే తన కెనరా బ్యాంకు సేవింగ్ అకౌంట్ నుంచి రూ.1.92లక్షల నగదు బదిలీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. వెంటనే చోరీపై మంగళవారం కంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యాప్ ద్వారా బదిలీ అయిన నగదు రూ. 1.21 లక్షలను ఫ్రీజ్ చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకుంటున్న నీరటి రాంచంద్రయ్య

అటు ఇటు కాని.. హృదయం తోటి..

- ఉదయం కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి..
- అర్ధరాత్రి సొంత గూటికి చేరిన అభ్యర్థి

మరికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'అటు ఇటు కాని హృదయం తోటి/ ఎందుకురా ఈ తొందర నీకు' అన్న పాట.. ఈ సందర్భానికి సరిగ్గా సరిపోతుందనిపిస్తోంది. నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల కేంద్రానికి చెందిన నీరటి రాంచంద్రయ్య సోమవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవికి, కాంగ్రెస్ పార్టీకీ రాజీనామా చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ మద్దతుతో ధన్వాడ సర్పంచ్ స్థానానికి తన భార్య నీరటి సుజాతతో నామినేషన్ దాఖలు చేయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తమై చర్చలు చేపట్టారు. అదే రోజు అర్ధరాత్రి మళ్లీ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు శివకుమార్ సమక్షంలో సొంత గూటికి చేరి, పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే భార్య చేత వేయించిన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటారా? లేదా అలాగే ముందుకు సాగుతారా వేచి చూడాల్సి ఉంది.

బెడిసికొట్టిన 'ఏకగ్రీవం'

- గ్రామస్థుల తీర్మానానికి అంగీకరించని ఓ అభ్యర్థి
- ఉపసంహరణకు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణ
- రాఘాయిపల్లిలో ఆర్డీవో, సీఐ విచారణ
- కేసు నమోదు చేసిన పోలీసులు



రాఘాయిపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో, సీఐ

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని రాఘాయిపల్లిలో ఓ అభ్యర్థి ఎదురుతిరగడంతో ఏకగ్రీవ తీర్మానం బెడిసికొట్టింది. మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న ఈ గ్రామపంచాయతీ ఎస్సీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. కానీ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేయాలని గ్రామస్థులందరూ అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి రూ. 25 లక్షలు ఇస్తానని సామ వెంకటయ్య అనే అభ్యర్థి ప్రతిపాదించడంతో అందరూ అంగీకరించారు. కానీ బర్కం గణేశ్ అనే అభ్యర్థి మాత్రం దీన్ని వ్యతిరేకించి వెళ్లిపోయాడు. అంతే కాకుండా తాను నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే రూ. 5 లక్షలు ఇస్తామంటూ తనపై ఒత్తిడి తెస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్ సిబ్బందితో కలిసి మంగళవారం గ్రామానికి చేరుకొని స్థానికులతో సమావేశమయ్యారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలని, ఎవరైనా బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బలవంతపు ఏకగ్రీవాలు చెల్లవని స్పష్టం చేశారు.

ఈ విషయంపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ చిదానందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సామ వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.



అక్షరమాల ప్రకారం గుర్తుల కేటాయింపు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలుగు అక్షరమాల ప్రకారం ప్రాధాన్య క్రమంలో గుర్తులను కేటాయిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలలో పేర్కొన్న పేరును అందులోని మొదటి అక్షరాన్ని ప్రాధాన్య క్రమంలో చూస్తారు. నామినేషన్ పత్రంలో ఏదైతే ముందు ఉంటుందో, ఆ అక్షరాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థుల తమ బ్యాలెట్ స్థానాన్ని ప్రభావితం చేసేందుకు కొందరు పేరును ముందుగా రాసి, ఆ తరువాత ఇంటి పేరు రాస్తారు. మరికొందరు ఇంటిపేరును ముందు రాస్తారు. ఉదాహరణకు అనంతయ్య, ఆంజనేయులు లేదా కళ్యాణ్ పోటీలో ఉంటే అనంతయ్యను మొదటి ప్రాధాన్యంగా పరిగణిస్తారు. తరువాత ఆంజనేయులు, కళ్యాణ్‌ల పేర్లు తీసుకుంటారు. వీరికి అక్కడ ప్రాధాన్యతలో కేటాయించిన గుర్తుల వరుస దక్కుతుంది.

ఎమ్మెల్యేల సొంతూళ్లలో త్రిముఖపోరు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేల సొంత ఊర్లలో త్రిముఖ పోటీ నెలకొన్నది. దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి స్వగ్రామం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. అక్కడ కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీల మద్దతుతో అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి స్వగ్రామం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ ఎస్సీకి రిజర్వ్ అయింది. ఇక్కడ కూడా త్రిముఖ పోరు నెలకొంది. కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు బరిలో ఉన్నారు.

తొలి విడత ఎన్నికలకు నేడు గుర్తుల కేటాయింపు

- ఈ రోజే నామినేషన్ల ఉపసంహరణ

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ తొలి విడత ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు బుధవారం గుర్తులను కేటాయించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లలో మొదటి అక్షరాన్ని పరిగణనలోకి తీసుకొని తెలుగు వర్ణమాల ఆధారంగా అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించి జావితాను రూపొందిస్తారు. ఒక వేళ అభ్యర్థి ఇంటి పేరును ఆంగ్లంలో, తన పేరును తెలుగులో రాస్తే, పేరులోని మొదటి అక్షరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఇద్దరు అభ్యర్థుల పేర్లు, ఇంటి పేరు ఒకే విధంగా ఉంటే.. మొదట నామినేషన్ వేసిన వారి పేరును ముందు చేరుస్తారు. ఇలా అభ్యర్థులకు వరుస క్రమంలో గుర్తులను కేటాయిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏ గ్రామంలో ఎంత అభ్యర్థులు పోటీలో ఉంటారో, ఎవరికి ఏ గుర్తులను కేటాయించారో తేలనున్నది.

అన్నదమ్ముల సవాల్!

- రామాపురంలో సోదరుల పోటీ



రామాపురంలో కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న తమ్ముడు కొమ్ము రాజుయాదవ్

పెంట్లవెల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని రామాపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అన్నదమ్ములు సై అంటే సై అంటూ పోటీకి దిగారు. జనరల్‌కు రిజర్వు అయిన ఈ గ్రామ పంచాయతీలో సర్పంచు పదవి కోసం సొంత అన్నదమ్ములు చెరో పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున అన్న కొమ్ము గోపాల్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ తరఫున తమ్ముడు కొమ్ము రాజుయాదవ్ మంగళవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇద్దరూ పోటీ పడటం సమంజసం కాదని, ఎవరో ఒకరు తప్పుకోవాలని కుటుంబ సభ్యులు వారికి నచ్చచెప్పేందుకు యత్నించినట్లు సమాచారం. కానీ అందుకు వారు అంగీకరించలేదని తెలిసింది.

సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సుదర్శన్‌గౌడ్

జడ్చర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సుదర్శన్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి స్వగృహంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. పాత, కొత్త అన్న తేడా లేకుండా నాయకులు, కార్యకర్తలందరినీ కుటుంబసభ్యుల్లాగా భావిస్తామని తెలిపారు. పార్టీలో రౌడీలు, భూకబ్జాదారులకు స్థానం లేదని స్పష్టం చేశారు. జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా, కొల్లూరును మండలంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు.

మురహర్‌దొడ్డి సర్పంచుగా పెద్ద నర్సమ్మ

- ఏకగ్రీవానికి గ్రామస్థుల తీర్మానం



ఏకగ్రీవంగా ఎన్నుకున్న కుమ్మరి పెద్ద నర్సమ్మ

కృష్ణ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని మురహర్‌దొడ్డి సర్పంచుగా కుమ్మరి పెద్ద నర్సమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు తీర్మానించుకున్నారు. మారెమ్మ ఆలయంలో మంగళవారం వారు సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే సదరు అభ్యర్థి గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు, ఆలయ నిర్మాణానికి రూ. 8 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు సమాచారం.

టంకరలో 'రాజ'బుడ్డప్ప

- గ్రామంలో ఆ కుటుంబానిదే హవా
- ఇప్పటి వరకు రెండు పర్యాయాలే ఇతరులు



టంకర గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలం టంకర మేజర్ గ్రామపంచాయతీలో మొదటి నుంచి ఇప్పటివరకు నేటి వరకే ఒకే కుటుంబం హవా కొనసాగుతోంది. అదే మెండె రాజబుడ్డప్ప కుటుంబం. 1956 నుంచి 1990 వరకు రాజ బుడ్డప్ప సర్పంచ్‌గా పనిచేశారు. ఈ మధ్య కాలంలో 1980 తరువాత శరణప్ప అనే వ్యక్తి మూడేళ్ళు సర్పంచ్‌గా పనిచేశారు. రాజబుడ్డప్ప తరువాత 1995లో అతని చిన్నకొడుకు అచ్చెన్న భార్య లక్ష్మి సర్పంచ్‌గా గెలుపొందారు. 2001, 2006లలో రెండు పర్యాయాలు అచ్చెన్న సోదరుడు శ్రీనివాసులు సర్పంచ్‌గా గెలుపొందారు. 2014లో గ్రామం ఎస్సీకి రిజర్వ్ కావడంతో యశోద అనే మహిళ సర్పంచ్‌గా పనిచేశారు. 2019లో అచ్చన్న తిరిగి సర్పంచ్ అయ్యారు. ప్రస్తుతం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మరోసారి అదే కుటుంబం నుంచి అచ్చెన్న భార్య లక్ష్మి పోటీలో నిలిచారు. ఇప్పుడు కూడా సర్పంచు పదవిని ఏకగ్రీవం చేసేందుకు గ్రామంలో చర్చలు నడిచాయి. ఏకగ్రీవం చేస్తే కోటి రూపాయలు అంజనేయస్వామి గుడికి ఇస్తానని చెప్పడంతో అందరూ అంగీకరించారు. కానీ ఈ విషయం మీడియాలో వైరల్ కావడంతో ఏకగ్రీవానికి బ్రేక్ పడి, పోటీ అనివార్యమైంది. గ్రామ జనాభాలో 75-80 శాతం అచ్చన్న సామాజిక వర్గం వాళ్ళే ఉండటంతో వారి కుటుంబం హవానే సాగుతోంది. ఈ కుటుంబంలో ప్రస్తుతం అచ్చెన్న, ఆయన భార్యనే ఉన్నారు. అచ్చన్న కొడుకు అమెరికాలో స్థిరపడ్డారు.

చెన్నిపాడు ఏకగ్రీవానికి యత్నం?

- రూ. 28 లక్షలకు వేలం పాట!

మానవపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవానికి గ్రామస్థుల మధ్య అంగీకారం కుదిరినట్లు సమాచారం. ఇక్కడ మూడో విడతలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం స్థానిక దేవాలయం వద్ద గ్రామస్థులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో స్మశానవాటిక ఏర్పాటు కోసం సర్పంచు పదవికి వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన సంజన్న అనే వ్యక్తి రూ. 28 లక్షలకు పాడి పదవిని దక్కించుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు వెల్లడి కావలసి ఉన్నది.

దావాజిపల్లి పంచాయతీ ఏకగ్రీవం

- సర్పంచుతో పాటు, వార్డు స్థానాలు కూడా..



ఏకగ్రీవ సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామస్థులు

పాన్‌గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని దావాజిపల్లి సర్పంచ్‌తో పాటు, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు తీర్మానించుకున్నారు. గ్రామంలోని రచ్చకట్ట వద్ద మంగళవారం సమావేశం నిర్వహించుకొని చర్చించుకున్నారు. గ్రామానికి చెందిన సూరమ్మను సర్పంచ్‌గా, ప్రేమ్ సాగర్‌ను ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు.

అలాగే గ్రామంలోని మొత్తం పది వార్డులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ వల్ల ఖర్చుతో పాటు ఘర్షణలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. అవేవీ లేకుండా ఉండేలా గ్రామస్థులం అందరమూ కలిసి ఏకగ్రీవంగా తీర్మానించుకున్నామని చెప్పారు.

నామినేషన్ వేయకుండా అడ్డగింత

- యర్సన్‌దొడ్డిలో గతనెల 29న ఘటన
- కలెక్టర్ ఆదేశం మేరకు అధికారుల విచారణ



చింతల కుంటలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

గద్వాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో మొదటి విడత నామినేషన్ల సందర్భంగా ఓ వ్యక్తిని నామినేషన్ వేయనీయకుండా అడ్డుకున్న సంఘటనపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట గ్రామానికి చెందిన కుశ అనే వ్యక్తి నవంబరు 29న నామినేషన్ వేసేందుకు యర్సన్‌దొడ్డిలోని నామినేషన్ కేంద్రానికి వెళ్లాడు. అయితే అప్పటికే సర్పంచు పదవికి ఓ వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు ప్రతిపాదించడంతో ఆయన నామినేషన్ వేశాడు. కానీ కుశ కూడా నామినేషన్ వేయడానికి వెళ్లడంతో కొందరు ఆయనను అడ్డుకున్నారు. ఈ విషయంపై బాధితుడు ఈనెల 1వ తేదీన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనను అడ్డుకొని ఒక గదిలో బంధించారని, నామినేషన్ పత్రాలను చించివేశాడని అతడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాకుండా సర్పంచు పదవిని వేలం వేసి, ఏకగ్రీవం చేశాడని లిఖిత పూర్వకంగా పేర్కొన్నారు. ఇదే విషయంపై సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఈ నేపథ్యంలో కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశం మేరకు తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో రమణారావు, ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం గ్రామానికి వెళ్లి బాధితుడు కుశతో మాట్లాడి, లిఖిత పూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద సంఘటన జరగడంతో, రిటర్నింగ్ అధికారి వివరణ కూడా తీసుకున్నారు.

ఈ విషయంపై తహసీల్దార్ హరికృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, కలెక్టర్ ఆదేశం మేరకు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

పేరూర్ సర్పంచ్ ఏకగ్రీవం

దేవరకద్ర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కౌకుంట్ల మండల పరిధిలోని పేరూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందుకోసం మంగళవారం గ్రామస్థులు సమావేశం నిర్వహించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి కొత్త శ్రుతి అరవింద్‌కుమార్ రెడ్డిని సర్పంచుగా ఎన్నుకోవాలని తీర్మానించారు. మొత్తం 10 వార్డుల్లో 5 కాంగ్రెస్‌కు, మరో 5 వార్డులు ఇతర పార్టీలకు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. వారి నిర్ణయం మేరకు ఉప సర్పంచును ఎన్నుకోనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో.. వివాహిత ఆత్మహత్య



మాధవి (ఫైల్)

కల్వకుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తిలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరు మండలం జాజాల గ్రామానికి చెందిన ఎ.గౌతమ్, భార్య మాధవి (35) దంపతులు కల్వకుర్తిలోని విద్యానగర్‌కాలనీలో నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య కలహాలు తలెత్తడంతో మనస్తాపానికి గురైన మాధవి సోమవారం అర్ధరాత్రి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సమాచారం అందుకున్న పోలీసులు, మాధవి కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.62 వేలు, 4 ఫోన్లు స్వాధీనం

జడ్చర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ సమీపంలోని చెరువు అలుగు వద్దనున్న పేకాట శిబిరంపై మంగళవారం ఎస్ఐ జయప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురి వద్ద రూ. 62 వేలు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పారిపోయారని ఎస్ఐ తెలిపారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● జడ్చర్ల మండలంలోని చెర్లపల్లిలోని ఓ బెల్టు షాపుపై ఎస్ఐ జయప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఈ సందర్భంగా వివిధ బ్రాండ్లకు చెందిన 4.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

మల్దకల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం, స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం వేద పండితులు మధుసూదనాచార్యులు, రమేశాచార్యుల ఆధ్వర్యంలో హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే రోజు రాత్రి జరిగిన స్వామి వారి కల్యాణానికి దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు వాల్మీకి పూజారుల సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి ప్రారంభించారు. కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి క్షేత్రానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పట్వారి ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు

పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉత్తరాదిమఠం నుంచి ఆలయం వరకు ఊరేగింపు
- నేడు నెమలివాహన సేవ, ప్రభోత్సవం



పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజారోహణకు హాజరైన భక్తులు

మక్తల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని ఉత్తరాది మఠం నుంచి పడమటి ఆంజనేయస్వామి ఆలయం వరకు స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త ప్రాణేషాచారి, అర్చకులు అరవింద్, ఈవో కవిత, భక్తులు అంజన్‌ప్రసాద్, శ్రీనివాసులు, రజినీకాంత్ పాల్గొన్నారు. ఉత్సావాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు పవమాన హోమం, సాయంత్రం 5 గంటలకు నెమలివాహన సేవ, 6 గంటలకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు.

న్యూస్ బాక్స్

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేటరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తా వద్దనున్న స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 9:30 గంటలకు జరిగే ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నెలరోజుల పాటు 30 పోలీస్ యాక్టు అమలు

» ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు నిషేధం

» ఎస్పీ డా.వినీత్

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈనెల రోజుల పాటు 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ డా.వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయొద్దని ఆయన సూచించారు. అనుమతులు లేకుండా పైకార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శిక్షణ

దామరగిద్ద, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యంగ్ ఆరేటర్స్ క్లబ్ ద్వారా 3 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ భాష పట్ల ఉన్న భయాన్ని తొలగించి ఆసక్తిని పెంపొందించేందుకు చేపట్టాల్సిన కృత్యాలు, అనుసరించాల్సిన బోధన పద్ధతులు, మెళకువల గురించి ఆయా తరగతులకు ఇంగ్లిష్ బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఆలోకిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి యాదానందన్ చక్రవర్తి వివరించారు. మెరుగైన విద్యను అందించేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సురేష్, మండలంలోని ఉపాధ్యాయులు, సీఆర్పీ రాములు ఉన్నారు.

'పార్లమెంట్‌లో టెట్ సవరణ బిల్లు పెట్టాలి'

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో టెట్ సవరణ బిల్లు పెట్టాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పాలమూరు ఎంపీ డీకే అరుణ కోరడం అభినందనీయమని బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ పేర్కొన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు గల ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ వారి నియామకంతో సంబంధం లేకుండా సుప్రీంకోర్టు తప్పనిసరిగా పేర్కొంది. ఈ యొక్క నిబంధనల వల్ల దేశంలో, రాష్ట్ర వ్యాప్తంగా అనేక మందిలో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. 2009 విద్యా హక్కు చట్టాన్ని సవరించేందుకు బిల్లును తీసుకురావాలని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరిన ఎంపీ డీకే అరుణకు పార్టీ జిల్లా శాఖ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గురుచరిత్ర పారాయణం ప్రారంభం

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులోని యానగుంది కొండకింద దత్తాత్రేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి గురుచరిత్ర పారాయణం ప్రారంభమైంది. మాతా మాణికేశ్వరి ట్రస్ట్ అధ్యక్షుడు శివయ్యస్వామి ఆధ్వర్యంలో భక్తులు గురుచరిత్ర పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తజయంతోత్సవాల సందర్భంగా బుధ, గురువారాల్లో మరో రెండురోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు, గురుచరిత్ర పారాయణం కొనసాగనుంది. కార్యక్రమంలో దత్తాత్రేయ ఆలయ ట్రస్ట్ కార్యదర్శి కృష్ణ కోర్‌వార్, శైలేంద్ర, సావిత్రి, సురేందర్, నితిన్, వీణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్

» పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

» పాడుబడ్డ భవనంలా తయారైన ప్రాంగణం

» సౌకర్యాలు కల్పించి, వసతులు మెరుగుపర్చాలని కోరుతున్న ప్రయాణికులు



ఊట్కూర్‌లో నిర్మించిన ప్రయాణికుల ప్రాంగణం



అంబేడ్కర్ చౌరస్తాలో హోటల్ షెడ్ కింద నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఊట్కూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బస్సుల రాకపోకలు, ప్రయాణికులతో కళకళలాడాల్సిన ఆర్టీసీ బస్టాండ్ బూత్ బంగ్లాగా మారింది. మండల కేంద్రంలో నారాయణపేట - మక్తల్ రోడ్డు పక్కన పాతిక సంవత్సరాల క్రితం బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్ ఏర్పాటుతో తమకు ఉపాధి దొరుకుతుందని భావించిన చిన్నచిన్న వ్యాపారులు, గ్రామస్థులు చందాలు వేసుకొని చెక్‌పోస్టు వద్ద 1.8 ఎకరాల భూమిని కొని ఆర్టీసీకి అందించారు. అప్పట్లో రూ.8 లక్షల వ్యయంతో బస్టాండ్‌ను నిర్మించి 2000 అక్టోబరు 30న నూతన బస్టాండ్‌ను ప్రారంభించారు. ప్రారంభంలో కొన్ని రోజులు బస్సులను బస్టాండ్ నుంచి నడిపిన అధికారులు ప్రయాణికులకు బస్టాండ్‌ను అలవాటు చేయాల్సిందిపోయి ఎవరూ రావడం లేదని బస్సులను అంబేడ్కర్ విగ్రహం చుట్టూ తిరిగి పోనిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం బొగ్గుల బట్టీకి కేంద్రంగా బస్టాండ్‌ను వినియోగించారు. ప్రస్తుతం కిటికీలు ఊడిపోయి, షట్టర్లు తుప్పు పట్టి ఆలనాపాలనా లేక ముళ్లపొదల నడుమ పాడుబడి శిథిలావస్థకు చేరుకుంది. బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూడడం తప్ప కూర్చోవడానికి స్థలం లేక బస్సులు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టు తిరిగిపోతుండటంతో ప్రయాణికులు వాటి కోసం మకాన్ని అక్కడికి మార్చారు. బస్టాండ్‌లో సౌకర్యాలు, మౌలిక వసతులు లేక ఎందుకూ పనికి రాకుండా పోయింది. పేరుకే బస్టాండ్ ఉన్నా అందులోకి బస్సుల రాకపోకలు లేక పాడుబడ్డ భవనంలా తయారైంది. బస్టాండ్‌లో ఉన్న స్టాళ్ల మరమ్మతు చేసి ఖాళీ స్థలాన్ని లీజుకు ఇస్తే ఆర్టీసీకి ఆదాయం పెరగడంతో పాటు, తమకు కొంతైనా ఉపాధి లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొనకపోతే భవిష్యత్‌లో బస్టాండ్ స్థలం కబ్జాకు గురయ్యే అవకాశాలు లేకపోలేదని వారు తెలిపారు.



అంబేడ్కర్ చౌరస్తాలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

నామినేషన్ కేంద్రాల పరిశీలన

నారాయణపేట/ఊట్కూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే నామినేషన్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. నారాయణపేట మండలం చిన్నజట్రం, ధన్వాడ, మరికల్ మండల కేంద్రాల్లోని నామినేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, అభ్యర్థులు నామినేషన్ ఫారాలు నింపే సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

అదేవిధంగా, ఊట్కూర్ మండలంలోని ఆరు నామినేషన్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో కిశోర్‌కుమార్ పరిశీలించారు. కేంద్రాల్లో వసతులు, ఇతర ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి గౌతమ్ గౌడ్, కారోబార్ వెంకటప్ప, గ్రామస్థులు ఉన్నారు.



తీలేరులో నామినేషన్లు వేయడానికి క్యూ లైన్‌లో నిలబడిన అభ్యర్థులు



చిన్నపొర్లలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నామినేషన్ దాఖలుకు బారులు

మరికల్ : మండల పరిధిలోని తీలేరు క్లస్టర్ నామినేషన్ కేంద్రంలో మంగళవారం చివరి రోజు కావడంతో నామినేషన్ వేయడానికి ప్రజలు బారులు తీరారు. మండలంలోని ఆరు క్లస్టర్లలో కంటే తీలేరు క్లస్టర్‌లో అధిక శాతం మంది నామినేషన్ వేయడానికి శ్రద్ధ చూపారు. రిటర్నింగ్ అధికారి రామకృష్ణ నామినేషన్ వేసే అభ్యర్థులను క్యూ లైన్‌లో నిలపెట్టి క్రమ సంఖ్యలో నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ పర్వం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



జల్దిబిందెను తీసుకువస్తున్న గ్రామస్థులు

మరికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీలేరు గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పవిత్రమైన బావి నుంచి మంగళవాయిద్యాల నడుమ జల్దిబిందెలో నీటిని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి దంపతులతో వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



కోనేరు జలాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

మక్తల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం గురుస్వాములు అశోక్‌గౌడ్, తాళంపల్లి అనిల్‌ల ఆధ్వర్యంలో అయ్యప్పలు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి పడమటి ఆంజనేయస్వామి ఆలయం కోనేరు వరకు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. కోనేరు నుంచి పవిత్ర నీటిని తీసుకొని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా బయలుదేరారు. ఆలయంలో బుధ, గురువారాల్లో స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు శ్రీధర్‌గౌడ్, నీలగౌడ్, వెంకట్‌రెడ్డి, రఘు, నర్సింహారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా నామినేషన్లు

మరికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డుల స్థానాలకు మంగళవారం చివరి రోజు కావడంతో నామినేషన్ మందకొడిగా కొనసాగింది. మరికల్ సర్పంచ్ స్థానానికి 7 మంది, వార్డుల స్థానాలకు 49, అప్పంపల్లి సర్పంచ్ స్థానానికి 5 మంది, వార్డుల స్థానాలకు 23 మంది, ఇబ్రహీంపట్నం సర్పంచ్ స్థానానికి 8 మంది, వార్డుల స్థానాలకు 18 మంది, పసుపుల సర్పంచ్ స్థానానికి 11, వార్డుల స్థానాలకు 24 మంది, తీలేరు సర్పంచ్ స్థానానికి 5 మంది, వార్డుల స్థానాలకు 28 మంది, పెద్దచింతకుంట సర్పంచ్ స్థానానికి 8 మంది, వార్డుల స్థానాలకు 33 మంది, వెంకటాపూర్ సర్పంచ్ స్థానానికి 5 మంది, వార్డుల స్థానాలకు 18 మంది, మాద్వార్ సర్పంచ్ స్థానానికి 6 మంది, వార్డుల స్థానాలకు 20 మంది, పల్లెగడ్డ సర్పంచ్ స్థానానికి 6 మంది, వార్డుల స్థానాలకు 14 మంది, పూసల్‌పహాడ్ సర్పంచ్ స్థానానికి 3, వార్డుల స్థానాలకు 22 మంది, రాకొండ సర్పంచ్ స్థానానికి 2, వార్డుల స్థానాలకు 27 మంది, జిన్నారం సర్పంచ్ స్థానానికి 4, వార్డుల స్థానాలకు 28 మంది, చిత్తనూర్ సర్పంచ్ స్థానానికి 12, వార్డుల స్థానాలకు 24 మంది, ఎక్లాస్‌పూర్ సర్పంచ్ స్థానానికి 5, వార్డుల స్థానాలకు 15 మంది, కన్మనూర్ సర్పంచ్ స్థానానికి 5, వార్డుల స్థానాలకు 33 మంది, బుడ్డగానితండా సర్పంచ్ స్థానానికి 4, వార్డుల స్థానాలకు 16 మంది, ఎల్లిగండ్ల సర్పంచ్ స్థానానికి 7, వార్డుల స్థానాలకు 25 మంది నామినేషన్లు వేశారు. మొత్తం మండలంలో 17 సర్పంచ్ స్థానాలకు 107, వార్డు మెంబర్ల స్థానాలకు 417 మంది నామినేషన్లు వేశారు.

పోస్టల్ బ్యాలెట్‌లో పొరపాట్లు చేయొద్దు



పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ ఇస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

» కలెక్టర్ సిక్తా పట్నాయక్

» పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ శిక్షణను అధికారులు వినియోగించుకుని, పోస్టల్ బ్యాలెట్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్ వినియోగం, లెక్కింపు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలి

» టెమా పాలమూరు జిల్లా కన్వీనర్ అహ్మద్‌పాషా

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే(ఐజెయూ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్(టెమా) పాలమూరు జిల్లా కన్వీనర్ అహ్మద్‌పాషా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన అక్రిడేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని, హెల్త్‌కార్డుల అంశం అసలే మరిచిపోయిందన్నారు. అక్రిడేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులను జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పోరాటంతోనే హక్కులు సాధించుకునేందుకు రాష్ట్ర నాయకత్వం మహాధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. బుధవారం ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం వద్ద చేపడుతున్న మహాధర్నాకు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈవో గోవిందరాజులు

కోస్గి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితమే ఉద్యోగ విరమణ పొంది విద్యార్థులకు మరింత విద్యను అందించాలన్న సంకల్పంతో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు సన్మానించారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్ ఏడాది క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. ఉద్యోగ విరమణ పొందిన పాఠశాలలో మల్లికార్జున్ అలాగే విద్యాబోధన చేస్తున్నాడు. మంగళవారం పాఠశాల తనిఖీకి వచ్చిన డీఈవో ఉపాధ్యాయుడి సేవాభావాన్ని గుర్తించి ఆయనను శాలువాతో సన్మానించారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్న సంకల్పంతో ఇప్పటికీ అలాగే బోధన చేయడం ఆదర్శమని, ఇలాంటి ఉపాధ్యాయులు అరుదని డీఈవో పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో అపార్ జనరేషన్‌పై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. ఆ తర్వాత బ్రాహ్మణ్‌వాడి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌ను పరిశీలించారు. ఎంఈవో శంకర్‌నాయక్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రాజేంద్రరావు, ఉపాధ్యాయులు వీరమల్లేష్, నాగరాజు ఉన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

» సీహెచ్‌సీ ఎదుట శానిటేషన్ సిబ్బంది నిరసన



మద్దూర్ సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న శానిటేషన్ సిబ్బంది

మద్దూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మద్దూర్‌లోని సీహెచ్‌సీ ఎదుట శానిటేషన్, పేషెంట్, కేర్, సెక్యూరిటీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల టెండర్ల పరిమితి పూర్తయినందున తిరిగి టెండర్లు పిలువాలని, తాము అందిస్తున్న సేవలను గుర్తించి తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 5న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ధర్నాకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

కృష్ణ/ఊట్కూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు అభ్యర్థులు బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నామని ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ మండలంలో మొత్తం నాలుగు క్లస్టర్ సెంటర్లు ఏర్పాటు చేశామని, ఒక్కో క్లస్టర్‌లో ఇద్దరు ఆర్‌వో, ఏఆర్‌వో అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. హిందూపూర్, గురుజాల, కుసుమూర్తి, తంగడిగి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు అభ్యర్థులు కృష్ణ మండల పంచాయతీ కార్యాలయంలో, గుడెబల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుడెబల్లూరు అభ్యర్థులు, ముడుమాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముడుమాల్, మురహర్ గ్రామాల అభ్యర్థులు, చేగుంట, ఐనాపూర్, అల్లంపల్లి, ఖాన్‌దొడ్డి, కున్సీ గ్రామాల అభ్యర్థులు కున్సీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలని ఆమె వివరించారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీవో తెలిపారు.

అదేవిధంగా, ఊట్కూర్ మండలంలోని ఊట్కూర్, తిప్రస్‌పల్లి, పగిడిమారి, పులిమామిడి, పెద్దజట్రం, చిన్నపొర్ల గ్రామంతో కలిపి మొత్తం ఆరు సెంటర్లలో నామినేషన్ల స్వీకరణ బుధవారం నుంచి జరుగుతుందని ఎంపీడీవో కిశోర్‌కుమార్ తెలిపారు. ఊట్కూర్ సెంటర్‌లో ఊట్కూర్ పంచాయతీ, తిప్రస్‌పల్లి సెంటర్‌లో తిప్రస్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, సమిస్తాపూర్, కొల్లూర్, లక్ష్మీపల్లి గ్రామాలు, పగిడిమారి సెంటర్‌లో పగిడిమారి, ఓబ్లాపూర్, అమీన్‌పూర్, వల్లంపల్లి గ్రామాలు, పెద్దజట్రం సెంటర్‌లో పెద్దజట్రం, నిడుగుర్తి, తిమ్మారెడ్డిపల్లి తండా, మగ్దూంపూర్, అవుసులోన్‌పల్లి గ్రామాలు, చిన్నపొర్ల సెంటర్‌లో చిన్నపొర్ల, పెద్దపొర్ల, ఎర్గట్‌పల్లి, ఎడవెల్లి, మల్లెపల్లి గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు వేయాలని ఆయన వివరించారు. కాగా, మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీలు, 220 వార్డులకు జరగనున్న ఎన్నికల్లో 44,492 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి పడిపూజ



దత్తపీఠంలో పూజలు చేస్తున్న స్వాములు

మక్తల్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం పసుపుల గ్రామ శివారులోని శ్రీదత్త పీఠంలో దత్తాత్రేయ స్వామి మహా పడిపూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామికి అభిషేకం, మంగళహారతి, భజనలు, ప్రత్యేక పూజలు చేశారు. మాతా నిరంజననందస్వామి, పరిపూర్ణనందస్వామి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ చేపట్టారు. కార్యక్రమంలో చిట్యాల లక్ష్మణ్, అంజి, దత్త దీక్ష స్వాములు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

మక్తల్ మండలంలోని మంతన్‌గోడ్, పసుపుల గ్రామాల్లోని దత్త ఆలయాల్లో దత్త జయంతిని పురస్కరించుకొని సాయంత్రం ప్రత్యేక పూజలు, రథోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథన్‌గోడ్‌లో సాయంత్రం జరిగే రథోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి : ఎస్ఐ



మద్దూర్‌లో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

మద్దూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. రోడ్డు నిబంధనలపై మంగళవారం మద్దూర్‌లోని ఆటోస్టాండ్‌లో డ్రైవర్లకు ఎస్ఐ పలు సూచనలు చేశారు. డ్రైవర్లు లైసెన్సు కల్గి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, అతి వేగంగా వాహనాన్ని నడుపవద్దన్నారు. అలాగే డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడొద్దని, మద్యం తాగొద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ గుంతలను పూడ్చరూ..



గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమైన మద్దూరు - కోస్గి ప్రధాన రహదారి

గుండుమాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడంపల్లి శివారులో ఉన్న వేరుశనగ ఆయిల్‌మిల్లు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రాణసంకటంగా మారాయి. మద్దూరు - కోస్గి ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డుపై చాలా చోట్ల గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముందు వెళ్లే వాహనం గుంతలు గమనించక సడన్ బ్రేక్ వేయడంతో వెనుకాల వచ్చే వాహనాలు ముందున్న వాహనాన్ని ఢీకొని ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయని వాహనదారులు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే రహదారిని మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.